క్లుప్తంగా

వైభవంగా నరనారాయణ జయంతి



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం అంగరంగ వైభవంగా నరనారాయణ జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళ శాసనాలతో, అహోబిల రామానుజస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు నర నారాయణునికి (శ్రీ కృష్ణుడికి) అభిషేకం, అలంకరణ, అష్టాక్షరీ మహామంత్ర జపం నిర్వహించామని, అనంతరం అష్టోత్తర శతనామార్చన, నక్షత్ర తనియన్ విన్నపం, సీతారాముల నిత్య కల్యాణ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని, సాయంత్రం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా ముగిసిందని వివరించారు.

చర్చికి ఎమ్మెల్యే ఆర్కే విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో చర్చికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.15 వేల విరాళాన్ని ప్రకటించారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు మాట్లాడుతూ తుమ్మపూడి గ్రామంలోకి బాప్టిస్ట్ చర్చికి అవసరమైన మైక్‌సిస్టమ్ కొనుగోలుకు ఎమ్మెల్యే ప్రకటించిన రూ.15 వేలు సోమవారం చర్చి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), సర్పంచ్ షేక్ అజీజున్, ఉప సర్పంచ్ బుద్దల రమేష్, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, యార్డు డైరెక్టర్ నిర్మల, సచివాలయ కన్వీనర్లు చిట్టిబొమ్మ సువర్ణ, పోపూరి హృదయరాజు, షేక్ జానీబాషా, నూతలపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ర్యాలీ



మంగళగిరి: మణిపూర్ మారణ హోమాన్ని మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. సోమవారం నగరంలోని కోర్టుల ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద న్యాయవాదులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న ఇటువంటి దురాగతాలను ఖండించాల్సిన బాధ్యత న్యాయవాదులపైనే కాదని, ప్రతి ఒక్కరిపైనా ఉందని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్ రామచంద్రరావు, జి జాన్‌బాబు, డాక్టర్ తాతా సాంబశివరావు, బి నాయుడమ్మ, ఎస్ సురేష్, ఎస్ ప్రసన్న, రాజ్యలక్ష్మి, వి.భారతి, ఎస్.రజని తదితరులు పాల్గొన్నారు.

మూలాంకురేశ్వరి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన మూలాంకురేశ్వరి దేవాలయ అభివృద్ధి పనులు సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఆలయ అర్చకులు జి.అయ్యన్నశాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ గోడలకు ఉన్న సున్నం, రంగులు సిబ్బందితో తొలగిస్తున్నామన్నారు. ఆలయంపై ఉన్న విమాన గోపురం, బొమ్మలకు మరమ్మతులు, ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ, ఫ్లోరింగ్ పనులకు సంబంధించిన పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి దేవదాయ ధర్మాదాయ శాఖ, గ్రామస్తులు, ఆలయ కమిటీ సహకారంతో పనులు చేస్తున్నామన్నారు.

నగరంలో పండుగ వాతావరణం

- శంకుస్థాపనకు భారీగా తరలిన లబ్ధిదారులు
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం
- ఏర్పాట్లు పరిశీలించిన నగర పాలక సంస్థ అధికారులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కింద సీఆర్‌డీఏ పరిధిలో 53 వేల మందికి నివాస స్థలాలు కేటాయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల నిర్మాణ శంకుస్థాపనకు కృష్ణాయపాలెం విచ్చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివాసముంటున్న అర్హులైన అక్కాచెల్లెమ్మలందరికి ఇళ్ల స్థలాలు రావడంతో వారందరూ ముఖ్యమంత్రి సభకు భారీగా తరలివెళ్లారు. ఉదయం 5 గంటల నుంచే తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని 20 సచివాలయాల్లో ఏర్పాట్లు చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, మెప్మా పీడీ వెంకటరావులు ఉదయాన్నే పలు ప్రాంతాల్లో సభాస్థలానికి వెళుతున్న బస్సుల వద్దకు వచ్చి బస్సులో సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, బ్రహ్మానందపురం, నులకపేట, ముగ్గురోడ్డు, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి అంబేద్కర్ సెంటర్, మహానాడు, సుందరయ్యనగర్, కొత్తూరు, బోసుబొమ్మ సెంటర్, సలాం హోటల్ సెంటర్, క్రిస్టియన్ పేట, తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, చిర్రావూరు, గుండిమెడ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, పెనుమాక తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది లబ్ధిదారులు కృష్ణాయపాలెంలో నిర్మించిన మోడల్ హౌస్ చూసేందుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు భారీగా తరలివెళ్లారు. కృష్ణాయపాలెంకు వెళ్లే ముందు మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినాదాలు చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు వారితోపాటు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న అనుమతి పత్రాలను సైతం బస్సులోనే అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డే అంటూ నినాదాలు చేశారు.



పెనుమాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న లబ్ధిదారులు



సభా ప్రాంగణంలోకి బారులు తీరి వెళుతున్న జనాలు

వర్షాన్ని లెక్కచేయకుండా...

తాడికొండ: తుళ్లూరు మండలం వెంకటపాలెం తిరుమల తిరుపతి దేవస్థానం ఎదుట సీఆర్డీయేలోని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ బహిరంగ సభకు జనాలు, లబ్ధిదారులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జోరువానలో గొడుగులు, ముసుగులు వేసుకొని సభా ప్రాంగణానికి బారులు తీరారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు వర్షం కురుస్తూనే ఉన్నప్పటికీ లెక్క చేయకుండా సీఎం ప్రసంగం ముగిసే వరకు ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సీఎం ప్రసంగంలో అడుగడుగునా ఇళ్ల స్థలాల పంపిణీకి కలిగిన అడ్డంకులు వాటిని న్యాయస్థానాల్లో ఎదుర్కొని పేదలకు ఇచ్చేందుకు చేసిన యత్నాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఆ సమయంలో జై జగన్, జై జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఓ వైపు రాజధానిలో సొంతింటి కల నెరవేరబోతున్న ఆనందం, మరో వైపు తమకు కల నెరవేర్చిన జగనన్న ఎదుట ఉండటంతో పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. సభకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లా లబ్ధిదారులకు ప్లాట్లు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు ఆయా కౌంటర్ల వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను తీసుకొని సంతోషం వ్యక్తం చేశారు. సభకు వచ్చిన జనాలకు ఇబ్బంది తలెత్తకుండా వలంటీర్లను అడుగడుగునా ఏర్పాటు చేసి తాగునీరు, అల్పాహారం అందించగా సభ ముగిసిన అనంతరం అందిరికీ భోజనం ఏర్పాట్లు చేశారు. తిని వెళ్లాలని సీఎం స్వయంగా తెలియజేయడంతో అందరూ బిర్యానీ పొట్లాలు, వాటర్ బాటిల్స్ తీసుకొని మరీ వాహనాలలో ఇంటికి బయల్దేరారు.

జాతీయస్థాయి కర్రసాము పోటీలకు విద్యార్థుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి కర్రసాము పోటీలకు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.వి. సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ సిలంబమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో భాగంగా అండర్-14 బాలికల విభాగంలో వి. హంసిని మీనాక్షి, బాలుర విభాగంలో వి. వైదిక్ సాదిత్య బంగారు పతకాల్ని కై వసం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని ఆయన సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ మాట్లాడుతూ కర్రసాము శిక్షణతో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కోచ్‌ను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కేవీ సెబాస్టియన్, మంజు

జగనన్న మా గుండెల్లో కొలువై ఉంటాడు

సీఎం సభకు రెట్టించిన ఉత్సాహంతో వచ్చిన మహిళలు, లబ్ధిదారులు

తాడికొండ: పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా గుండెల్లో కొలువై ఉంటాడని రాజధానిలో ఇళ్ల స్థలాలు తీసుకున్న మహిళలు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలో సోమవారం జరిగిన బహిరంగ సభకు మహిళలు, లబ్ధిదారులు పోటెత్తారు, సొంతింటి కల సాకారం అవుతున్న వేళ ఇంటి నిర్మాణ మంజూరు పత్రం అందుకున్న ఆనందంలో సాక్షితో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

కల నెరవేరింది



జీవితంలో నెరవేరదు అనుకుంటున్న కల నెరవేర్చుతున్న జగనన్నకు వందనాలు. ఇంటి స్థలం ఇచ్చినపుడు ఆర్థిక స్థోమత లేదు ఎలా అనుకున్నా, కానీ స్థలంతోపాటు ఇల్లు కూడా కట్టించి ఇస్తానంటున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బాడిగి జ్యోతి, బోరుపాలెం

18 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..



18 సంవత్సరాలుగా అద్దె ఇంటిలో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. చిన్న గదికి రూ.4 వేలు అద్దె కట్టాలంటే ఇబ్బందిగా ఉంది. జగనన్న పుణ్యమా అని సొంతిల్లు రావడం ఆనందంగా ఉంది

– ఊట్ల కనకదుర్గాదేవి, మంగళగిరి

పేదోళ్లకు అండగా జగనన్న



గత ప్రభుత్వాలు పేదవాళ్లను పట్టించుకునేవి కావు, మా లాంటి పేదలకు అండగా నిలుస్తున్న జగనన్న ఎప్పటికీ సీఎంగా కొనసాగాలి. సంక్షేమ కార్యక్రమాలతో మాకు ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవితం సాగుతుంది. నిడమర్రు లే అవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. సొంతిల్లు కట్టుకుంటే ఆర్థిక భారం కూడా తగ్గి కుటుంబ ఆదాయం పెరుగుతుంది

– ఊట్ల లోకేశ్వరి, మంగళగిరి

జగనన్న లేకుంటే ఇల్లు కట్టుకోవడం కష్టమే



పేదవాడికి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న వారికి ఇది చెంపపెట్టు. జగనన్న లేకుంటే ఈ ప్రాంతంలో మాకు ఇంటి స్థలం ఇల్లు నిర్మించుకోవడం కష్టమే. మా కల నెరవేర్చుతున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– తూర్పు సీతామహాలక్ష్మి, ఉండవల్లి

పేదల కష్టం తెలిసిన జగన్



పేదల కష్టం తెలిసిన వాడిగా గతంలో ఎవ్వరూ చేయని పథకాలు అమలు చేస్తూ, నా లాంటి నిరుపేదలకు ఆసరాగా నిలుస్తున్న మా బిడ్డ జగన్ గుండెల్లో కొలువై ఉంటాడు. దేవుడు పటాల్లో కనిపిస్తాడేమో కానీ జగన్ గుండెల్లో ఉండేలా నాకు సాయం చేశాడు.

– బొమ్మిడి లక్ష్మి, ఉండవల్లి

జగనన్న రుణం తీర్చుకోలేనిది



పేదలను ఆదుకోలేని ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా ఎవరికీ ఉపయోగం ఉండదు. మా సొంతింటి కల నెరవేర్చేందుకు నేడు ఇంటి నిర్మాణ పత్రం అందించిన జగనన్న రుణం తీర్చుకోలేనిది. వానొచ్చినా వరదొచ్చినా సొంతింట్లో ఉంటే ఆ సంతోషం వేరు.

– బొమ్మిడి రమణ, ఉండవల్లి

జీజీహెచ్‌లో ఆధార్ రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక కౌంటర్



గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగం(ఓపీ)లో ఆధార్‌కార్డు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఓపీ విభాగం వద్ద సోమవారం ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికీ ప్రభుత్వ పథకాలు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆసరా పథకాలు రోగుల చెంతకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును ప్రత్యేక నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించినట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. దాన్ని పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డును రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. దీని ద్వారా రోగుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం జమ అవుతుందని వివరించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ షమీనా బేగం, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అదనంగా ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాలు

రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అవుట్ పేషెంట్ విభాగంలో అదనంగా పది ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఓపీ విభాగాన్ని పరిశీలించారు. పేర్లు నమోదు చేసుకు నే కౌంటర్ వద్ద రోగులు అధిక సంఖ్యలో ఉండటం గమనించి తక్షణమే అదనంగా ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు.

దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ

జీజీహెచ్‌లో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్‌కు త్వరలోనే ప్రత్యేక ఓపీ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల చట్టం పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ కుమార్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యల్ని బందెల వివరించారు.

ఎమ్మెల్యే ఆర్కేకు అండగా నిలవాలి

- యాదవ సామాజికవర్గ నేతలు
- యాదవ సామాజికవర్గాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు
- కమ్యూనిటీ హాల్ స్థలం పరిశీలన

మంగళగిరి: రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కు నియోజకవర్గంలోని యాదవులంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని యాదవ సంఘ నేతలు పేర్కొన్నారు. నగరంలో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కార్పొరేషన్ 25 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు రూ.1.05 కోట్ల నిధులు కేటాయించడం వెనుక ఎమ్మెల్యే ఆర్కే కృషి మరువరాదన్నారు. సోమవారం ఇందిరానగర్‌లోని కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాన్ని యాదవ సంఘ నేతలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి యాదవుల చిరకాల వాంఛ అయిన యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరగడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం యాదవులను పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఆర్కే యాదవ కమ్యూనిటీ హాలు నిర్మించడానికి చొరవ తీసుకోవడం ప్రశంసనీయమని కొనియాడారు. యాదవుల్లో అత్యధికంగా పేదవాళ్లు తమ ఇంట్లో ఏదైనా శుభకార్యం చేసుకోవాలంటే కల్యాణ మండపాలకు, కన్వెన్షన్‌లకు రూ.లక్షల అద్దెలు చెల్లించలేక ఇళ్ల ముందే టెంటు వేసుకుని జరుపుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షం కురిస్తే శుభకార్యాల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో ఆ కష్టాలు తీరనున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బళ్ల శ్రీనివాసబాబు, సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కుర్రా పున్నారావు, బీజేపీ నాయకులు తులిమిల్లి శ్రీనివాసరావు, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోట శివరామప్రసాద్, మంగళగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్ల బ్రహ్మయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, ఆయా పార్టీల నాయకులు చావలి ఉల్లయ్య, డీవీఆర్, తోట సాంబ, చింతా మహేష్, సారమేకల బాబి, తాడిబోయిన సురేష్, బుర్రి సతీష్, దానబోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న యాదవ సంఘ నాయకులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మంగళగిరి: విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంక్ 108వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో 90 శాతం మార్కులు సాధించిన ఖాతాదారుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. నగరంలోని బ్యాంకు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు పీవీ రమణారావు, చిన్నం కోటేశ్వరరావులు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వారు మాట్లాడుతూ 1500 కో ఆపరేటివ్ బ్యాంకుల్లో అతి పెద్ద కో ఆపరేటివ్ బ్యాంకుగా ది విశాఖపట్టణం కో ఆపరేటివ్ అవతరించిందని, ఖాతాదారులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ మంగళగిరి బ్రాంచి పరిధిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో 90 శాతం మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు రూ.27,500 నగదు పురస్కారంతోపాటు మెరిట్ సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కేవీబీ ఫణిప్రసాద్, ఎ వెంకటస్వామి, బత్తూరి మోహనరావు, జె రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

లంక భూములకు పట్టాలు ఇవ్వాలి

ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామంలో అనేక సంవత్సరాలుగా పేదలు సాగుచేసుకుంటున్న లంక భూములకు పట్టాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లంక భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో వారి భూములు, రైతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, కనీసం ఈ క్రాప్ బుకింగ్ కూడా చేయడం లేదని అన్నారు. అనేకమందికి పాసు పుస్తకాలు కూడా లేవని, దీనివలన పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, ఇతర వ్యవసాయ సబ్సిడీలు, రాయితీలు పొందలేకపోతున్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు సాగుచేసుకుంటున్న లంక, పోరంబోకు, బంజరు ఇతర భూములకు పట్టాలిస్తామని నిర్ణయం చేసిందని, వెంటనే ఆ నిర్ణయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ లంక భూములు సాగుచేసుకుంటున్న పేదలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వారి పంటలను ఈ క్రాప్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు భీమిరెడ్డి అమ్మిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసరి విజయలక్ష్మి, రైతులు మొలబంటి పుట్లమ్మ, బి.సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు

30న మిర్చి యార్డు పాలకవర్గం ప్రమాణం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం: మిర్చి యార్డులో పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పరిశీలించారు. సభ నిర్వహణ కోసం విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంతోపాటు రైతు సమాచార కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చైర్మన్ కార్యాలయంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి, కొత్త పాలకవర్గం, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. మంత్రి అంబటి మాట్లాడుతూ 30న పెద్దఎత్తున జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, విడదల రజిని, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ యార్డుని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ యార్డు నుంచి అత్యధిక శాతం మిర్చి విదేశాలకు ఎగుమతి అవుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, యార్డు నూతన చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ, డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గుంటూరు మిర్చి యార్డు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అంబటి, జిల్లా అధ్యక్షుడు డొక్కా

స్కిజోఫ్రీనియా రోగులకు పరీక్షలు

గుంటూరు మెడికల్: మానస స్కిజోఫ్రీనియా ఫౌండేషన్ గుంటూరు, ఆంధ్రప్రదేశ్ సైక్రియాట్రి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మానస హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సైక్రియాట్రి సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ స్కిజోఫ్రీనియా బాధితులతో కుటుంబసభ్యులు ప్రేమతో వ్యవహరించాలని సూచించారు. క్రమం తప్పకుండా రోగులు మందులు వాడేలా చూడాలని తెలిపారు. ప్రతినెలా నాలుగో ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందుల్ని అందిస్తున్నామని తెలిపారు.

సమానత్వం కోసం గర్జించిన జాషువా



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో గుర్రం జాషువా సేవా సమితి కార్యాలయంలో సోమవారం గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గుర్రం జాషువా సేవాసమితి అధ్యక్షుడు దర్శనపు శామ్యూల్, కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్యలు మాట్లాడుతూ విశ్వమానవ సమానత్వం గురించి గర్జించిన కవి చక్రవర్తి గుర్రం జాషువా అని, దళిత వర్గానికి జ్వాలా స్ఫూర్తి అని, చిన్నతనం నుంచి జాషువా బొమ్మలు గీయడంలో, పాటలు పాడడంపై ఆసక్తి ఉండేదని అన్నారు. 1970లో పద్మభూషణ పురస్కారం ఆయనకు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో గుర్రం జాషువా సేవా సమితి సహాయ కార్యదర్శి బూదాల రవికుమార్, సభ్యులు పెరికె బాబు, బూదాల బాబూరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల ప్రజాపరిషత్ సమావేశం ఈనెల 27న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.అనూరాధ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. పలు అభివృద్ధి పనులపై మండలస్థాయి అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.